

కృష్ణానదిలోకి చేప పిల్లలను వదులుతున్న మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

# చేప పిల్లల అభివృద్ధికి కేజ్‌కల్చర్

● మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి ● మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ● కృష్ణా నదిలో చేప పిల్లల వదిలివేత

**నాగార్జునసాగర్:** సాగర్‌లో చేపపిల్లలను అభివృద్ధి చేసేందుకు కేజ్‌కల్చర్ (బోనులో చేపల పెంపకం) ఎంతగానో ఉపయోగపడుతుందని మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన సాగర్‌లో కృష్ణానదిలో చేపపిల్లలు వదలడానికి వచ్చారు. ఉదయం 11గంటలకు సాగర్ విజయవిహార్ అతిథి గృహానికి చేరుకున్న ఆయనకు నియోజకవర్గ ఇన్‌చార్జి నోముల నర్సింహయ్య, మండల పార్టీ అధ్యక్షుడు బ్రహ్మారెడ్డి స్వాగతం పలికారు. కాసేపు విశ్రాంతి అనంతరం తెలంగాణ లాంచీ స్టేషన్‌నుంచి ప్రత్యేక లాంచీలో దయ్యాల గండి వద్దకు చేరుకున్నారు. అక్కడ ఎర్రగుట్ట వద్ద ఏర్పాటు చేసిన కేజ్‌కల్చర్ బోనుల్లో చేపపిల్లలను వదిలారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేజ్‌కల్చర్‌ను అభివృద్ధి చేయడం ద్వారా మత్స్యకారులకు ఆర్థికంగా చేయుత అందుతుందన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని కులాల అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్ద పీట వేస్తున్నారని తెలిపారు. సాగర్‌లో ఉన్న మత్స్యకారులకు మర పడవలు, వలలు అందజేస్తామని తెలిపారు. నదులు, చెరువుల్లో నాణ్యమైన చేపల పిల్లలను వదులుతున్నామని, వీటిద్వారా చేపలు త్వరగా అభివృద్ధి చెంది మత్స్యకారులకు వేటకు అనువుగా ఉంటుందన్నారు. మత్స్యకారులు నదిలోకి వేటకు వెళ్లడానికి అటవీశాఖ వారు అనుమతులు ఇవ్వటం లేదని మత్స్యకారులు మంత్రికి మొరపెట్టుకున్నారు. స్పందించిన మంత్రి నదిలోకి వెళ్లేందుకు మత్స్యకారులకు అనుమతివ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టర్ గౌరవ్ ఉప్పల్, మిర్యాలగూడ ఆర్డీవో కిషన్‌రావు, పెద్దవూర తహసీల్దార్ విజయ్‌కుమార్, జేడీ ఏహెచ్ డాక్టర్ రమేష్, మత్స్యశాఖ ఏడీ చరితరెడ్డి, డీడీ మురళీ, ఎంపీపీ మల్లిక, టీఆర్ఎస్ నేతలు శేఖరాచారి, రమేష్, సుధీర్‌కుమార్, ఎక్కలూరి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

